# కూడా వచ్చేది

మా పెద్దాడు అమెరికాలో ఉన్నాడు. ఎలాగూ రాలేదు. మా రెండోవాడూ కోడలు, మా అమ్మాయీ అల్లుడూ పెద్ద ఉద్యోగాల్లోనే ఉండి ఫ్లాట్లుకూడా కొనుక్కొని బొంబాయిలో సెటిలయ్యారు. వాళ్లకీ ఇద్దరేసి పిల్లలు. దీపావళి కొస్తానన్నారు కదా అని నాలుగొందలెట్టి టపాకాయలు కొన్నాను. కొత్తబట్టలు, వాళ్లకి నచ్చినవి, కొనుక్కు తెచ్చుకోమని చెరో అయిదువేలూ రెండువారాల ముందరే పంపాను. ఎల్లుండి దీపావళి అనగా, కూడబలుక్కున్నట్లు ఏదో కారణాలు చెబుతూ రావటంలేదని ఫోన్లు చేశారు. తరచు ఫోన్లు చేస్తూనే ఉంటారు. వస్తే సంతోషించడం, రాకపోతే వాళ్ల ఇబ్బందులు వాళ్లకుంటాయని సరిపెట్టుకోవడం మా ఆవిడ బ్రతికున్న రోజుల్లో కూడా చాలాసార్లయింది. తల్లిదండ్రులుగా వాళ్ల పట్ల ప్రేమాభిమానాల్ని పెంచుకోవడం సహజం. వాళ్లే తల్లిందండ్రులై సంసారబంధాలు పెంచుకున్నాక మాపట్ల వాళ్లకు ఉండేది గౌరవం, మా క్షేమం గురించి నైతికబాధ్యత మాత్రమే.

"మాతా నాస్తి పితా నాస్తి, నాస్తి బంధుస్సహోదరః, అర్థం నాస్తి గృహం నాస్తి తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త!" అన్నాడు ఆదిశంకరాచార్య. తల్లీతండ్రీ, బంధువులు, స్నేహితులూ, భార్యాబిడ్డలు, ఆస్తిపాస్తులు-నా వాళ్లు, నావి అనే మమకారం వట్టి భ్రమ అంటూ మేల్కొలిపాడు. అయితే వాటిని త్యజించి సన్యసించమనలేదు. తెలుసుకుని జాగ్రత్త పడమన్నాడు. నాలుగైదేళ్లక్రితం వరకూ మా తల్లితండ్రులు, అత్తమామలు తాలూకు బ్లాక్ అండ్ వైట్ ఫోటోలు గోడకుండేవి. ఇప్పుడు వాటి స్థానే మా దంపతులవి, మా అబ్బాయి-కోడలు, మా అమ్మాయి-అల్లుడు, వాళ్ల పిల్లలవి కలర్ ఫోటోలు ముచ్చటగా ఉన్నాయి. ఆ ముసలాళ్ల ఫోటోలు, జ్ఞాపకాలు కాలగర్భంలో కలిసిపోయాయి. వాళ్లు మళ్లీ జన్మలెత్తారో, ఎత్తుతే.... ఎక్కడున్నారో! మా ఫోటోలగతీ ఏదో ఓనాడు అంతే. మా అమ్మా నాన్నా జీవితాంతం పిల్లల యోగక్షేమాలే వాళ్ల లక్ష్యంగా బతికారు. చెయ్యగలిగి ఉండీకూడా దాన ధర్మాలు చేస్తే మాకిచ్చే ఆస్తిపాస్తులు తరిగిపోతాయేమోనని వెనుదీసేవారు. మనిషి జీవిత పరమావధి పిల్లల్ని కని, పెంచి పెద్దవాళ్లని చెయ్యడమేనా! చేసినందుకు వాళ్లకి ఏం దక్కింది! కూడా ఏం పట్టుకెళ్లగలిగారు!

"రామానందం మేస్టారొచ్చేరు!" అని కబురు తెచ్చాడు గోపి.

"మేడమీదకు తీసుకురా. నాతోబాటు ఆయనకికూడా రెండరిటిపళ్లూ, మజ్జిగా పట్టుకురా!" అన్నాను.

రామానందంగారు రిటైర్డ్ స్కూల్ టీచర్. మా వీధిలోనే ఉంటాడు. ఆయనకి ముగ్గురు ఆడపిల్లలు, ఒక మొగపిల్లాడు. ఇద్దరు ఆడపిల్లలకి పెళ్లిళ్లు చేశాడు. పెన్షన్‌తోబాటు పొద్దున్నా, సాయంత్రం ట్యూషన్లు చెప్పుకుంటూ బండి లాక్కొస్తున్నాడు. ఆయన నాకు సన్నిహితుడవడానికి ముఖ్యకారణం చిన్నప్పుడు మా ముగ్గురు పిల్లలకీ, తర్వాత గోపీకి ట్యూషన్ చెప్పేవాడు. మా రెండోవాడికీ, అమ్మాయికీ చదువులు బాగా వొచ్చాయి.

మా పెద్దాడు రఘుకి తల్లిచేసిన గారాబం వల్లనయితేనేం, చదువుమీద శ్రద్ధాసక్తులు తక్కువ అవడంవల్లనైతేనేం స్కూల్లోనూ, కాలేజీలోనూ మధ్యమధ్య ఫెయిలవుతూ చచ్చిచెడి బియ్యే పాసయ్యాడు. వాడికి నచ్చిన ఉద్యోగం దొరక్కపోవడంవల్లా, ఇంటాబయటా ఎదుర్కొనే అవమానాలవల్లా పదేళ్లక్రితం ఇల్లు విడిచిపెట్టి పారిపోయాడు. కొన్నాళ్లు దక్షిణాది పుణ్యక్షేత్రాలన్నీ యాత్రీకుల్ని టాక్సీమీద తిప్పుతూ, గైడ్‌గా కూడా ఉంటూ పొట్టపోసుకుంటున్నట్టు తెలిసి, ఇంటికి తిరిగి రమ్మని బతిమాలడానికి రామానందంగార్ని పంపాను. ఆయనన్నా, ఆయన మాటన్నా వాడికి గౌరవం. రామానందంగారు ఊర్లో మధ్యమధ్య వేదాంతోపన్యాసాలుకూడా ఇస్తూ ఉంటాడు. 'మాతృదేవోభవ పితృదేవోభవ..' అంటూ ఎన్ని విధాల చెప్పినా ససేమిరా రానన్నాడు. ఆయన తిరిగొచ్చి, "బుద్ధి కర్మానుసారే... కానీండి పైన భగవంతుడున్నాడు. ఆయనే చూసుకుంటాడు" అని మమ్మల్ని ఓదార్చాడు. నాలుగైదేళ్ల క్రితంవరకూ నాకే లోటూ లేదు. హాయిగా ఉన్నాను అంటూ మధ్యమధ్య ఫోన్లు చేసేవాడు. తర్వాత ఊటీలో ఓ అమెరికన్ లేడీ దగ్గర చాఫర్ పనిచేసి రెండేళ్లక్రితం ఆమెతో లాసేంజిలెస్ వెళ్లిపోయి, ఆమె ఆర్థిక సహాయంతో ఓ పెట్రోల్ బంక్ నడుపుతున్నాడట. ఇక్కడ శివరావని నా స్నేహితుడు, అడ్వొకేట్. వాడి కొడుకు రవి చదువుకుని అమెరికా వెళ్లి లాసేంజిలెస్‌లో ఓ పెద్ద ఉద్యోగంలో సెటిలయ్యాడు. వాళ్లిద్దరూ బాల్య స్నేహితులు. అంచేత రవిద్వారా రఘు క్షేమసమాచారాలు తెలుస్తున్నాయి.

"ఏమిటి రామానందంగారూ! ఈమధ్య కనబడటంలేదు?" అని కుశల ప్రశ్న వేశాను.

"మొహం చూపెట్టడానికి సిగ్గుపడే దుస్థితిలో ఉండి, ఇంక గత్యంతరం లేక కుచేలుడు కృష్ణభగవానుని ఆశ్రయించినట్టు మీ దగ్గరకొచ్చాను!" అన్నాడు.

పాపం! చాలా ఆత్మాభిమానం గల మనిషి. "సమస్యేమిటో చెప్పండి!" అన్నాను.

"మేము పదేళ్లుగా ఉన్న ఇంటియజమానికి వరసగా మూడిళ్లు ఉన్నాయి. అవికూలగొట్టేసి నాలుగంతస్తుల మేడ వెయ్యడానికి కంట్రాక్టికిచ్చేడు. అమ్మాయి ఫైనలియర్ బి. కాం. లోనూ, అబ్బాయి సెకండియర్ ఇంటర్‌లోనూ ఉన్నారు. వెంటనే ఖాళీ చెయ్యమని నోటీసిచ్చేడు ట్యూషన్‌కొచ్చే పిల్లలు చుట్టుపక్కలవాళ్లు. ఇళ్ల అద్దెలా విపరీతంగా పెరిగిపోయాయి..." అన్నాడాయన.

"దీపావళి వెళ్లేక కనబడండి. మా ఇంట్లో కిందభాగంలో ఉండటానికి వీలుగా ఉంటుందేమో చూస్తాను. ఏదో చేద్దాం, భయపడకండి!" అని ధైర్యం చెప్పాను.

ఆయన నా పాదాలు తాకబోయారు.

"ఆయనకి సాయం చెయ్యాలి, మామయ్యా! చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. ఆయన భార్య రెండిళ్లల్లో వంట పనికూడా చేస్తుంది" అన్నాడు గోపీ, ఆయన వెళ్లిపోయాక.

"ఏం చేద్దామంటావు?"

"అత్తయ్య పోయినప్పటినుంచీ నువ్వూ, నేనూ మేడమీదే కదా ఉంటున్నాం. నీ పడకగది, హాలూ కాక ఇంకా రెండు గదులున్నాయి. అందులో ఓ గది వంటగదికింద చేసుకుంటే కిందంతా వాళ్లకిచ్చెయ్యొచ్చు. కింద హాల్లో ట్యూషన్లు చెప్పుకున్నా, వాళ్లుండటానికి కావల్సినన్ని గదులున్నాయి!" అంటూ నాకు తోచిన ఆలోచనే వాడూ చెప్పాడు.

వాడి గురుభక్తికి నవ్వుకున్నాను. గోపీ మా చెల్లెలి కొడుకు. మొదట్లో వాడితండ్రి బాగానే ఉన్నాడు. మంచి ఉద్యోగం, తర్వాత్తర్వాత వ్యసనాలకిలోనై మా చెల్లెల్ని డబ్బు తెమ్మని పీడించడం, హింసించడం మొదలెట్టాడు. చివరికి పదిహేనేళ్ల గోపీని నా దగ్గిరకి పంపించి ఆత్మహత్య చేసుకుంది. గోపీకి చదువు లేదు. పదిహేనో ఏట ఏడోక్లాసు పుస్తకాలతో ప్రారంభించి రామానందంగారు నాలుగేళ్ల తంటాలుపడి వాణ్ణి మెట్రిక్ పాస్ చేయించారు. ఈలోగా మా ఆవిడ నిర్బంధంవల్ల వాడికి ఇంటిపని, వంటపనిలోనూ సాయం చెయ్యడంతోబాటు కారు డ్రయివింగ్ కూడా నేర్పించి ఇంట్లో పెట్టుకున్నాం. ఇప్పుడు వాడికి పాతికేళ్లు. ఇన్నాళ్లూ మా ఆవిడకి తెలియకుండా అడ్వొకేట్ శివరావుద్వారా గోపీ పేర అప్పుడూ అప్పుడూ కొంతడబ్బు జమ చేస్తు వచ్చాను. ఏదో తిండీబట్టా పెట్టి

పైఖర్చులకేదో ఇస్తున్నానని మా ఆవిడ ఉద్దేశం. మా ఆవిడ స్వార్థపరురాలు కాదు, దుర్మార్గురాలు కాదు. కావాల్సినంత దైవభక్తి, పూజలు, వ్రతాలు, జపాలు, యాత్రలు, కొద్దోగొప్పో దానధర్మాలు... అన్నీ ఉన్నాయి. నాకింకా అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ ఉండగా ఈ గోపీని పెంచి పెద్దచేసే భారం మా కుటుంబానికే ఎందుకు పరిమితం చెయ్యాలి అని దాని అక్కసు.

★ ★ ★

మేడమీద బాల్కనీలో కుర్చీ వేస్తే కూర్చున్నాను. కింద గోపీ అధ్వర్యంలో, మా పిల్లలు రానందున వాళ్లకోసం తెచ్చిన టపాకాయల్తో జరుగుతున్న ఆనందసంరంభం చూస్తుంటే నిరుడు జరిగిన దీపావళి జ్ఞాపకమొచ్చింది. నిరుడు దీపావళి పదిరోజులుందనగా నాకు గుండెపోటొచ్చింది. బొంబాయి ఫోన్‌చేస్తే మా రెండో అబ్బాయి, అమ్మాయి సకుటుంబంగా వచ్చారు. ఏంజియోప్లాస్టీ చేసి ఇప్పట్లో బైపాస్ సర్జరీ అవసరం లేదు అని హాస్పిటల్నుంచి డిశ్చార్జ్ చేశారు. నాలుగు రోజుల్లో దీపావళి ఉంటే ఎలాగెడతారని బలవంతం చేస్తే పిల్లలందరూ ఆగిపోయారు. ఇలాగే బాల్కనీలో కుర్చీ వేస్తే తలగడా అనుకుని కూర్చున్నాను. పక్కనే ఓ కుర్చీ వేసుకుని మా ఆవిడకూడా కూర్చుంది. పిల్లలు, మనవలు, మనవరాళ్లు టపాకాయలు కాల్చడంలో ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలమీద రన్నింగ్ కామెంట్రీ ఇస్తూ నా దృష్టి అటూఇటూ మళ్లించడంలో నిమగ్నురాలైంది.

"నేను చెబితే నమ్మరు, అలా చూడండి- మతాబాలు, కాకరపువ్వొత్తులపెట్లు, సీమటపాకాయల గుత్తులు సన్నసన్నగా గోపీ ఆ వీరయ్యింటికి ఎలా జేరేస్తున్నాడో!" అంది.

"పోనిద్దూ, అటు చూడకు. అయినా వాళ్ళూ మన కాంపౌండ్‌లోనేకదా కాలుస్తున్నారు!" అన్నాను.

నేను ఈ సీతారాంపురంలో ముప్ఫయ్యేళ్లు గవర్నమెంట్ ఫెర్టిలైజర్ ఫాక్టరీలో పనిచేసి పదేళ్లక్రితం రిటైరయ్యాను. వీరయ్యకి నేనే అటెండర్ ఉద్యోగం ఇప్పించాను. చాలా నమ్మకస్తుడు. ఇరవయ్యేళ్ల క్రితం కాస్త ఊరుబయట చవగ్గా వస్తే ఓ వెయ్యిగజాలు కాంపౌండున్న ఇల్లు కొనుకున్నాను. ఆ కాంపౌండ్‌లో రెండు కారు షెడ్లుంటే, ఓకారు షెడ్‌కి అవసరమైన హంగులు ఏర్పాటు చేసి, కాస్త సాయంగా ఉంటారని వీరయ్య సంసారానికి ఆశ్రయం కల్పించాను.

"అలా అంటారనుకుంటూనే ఉన్నాను. వీరయ్యకీ పెన్షనొస్తుంది. మీరూ అడపాతడపా పనున్నా, లేకపోయినా ఏదో ముట్టచెబుతూనే ఉన్నారు. వాడి కూతురు లక్ష్మి మండలి ఆఫీసులో గుమాస్తా పనిచేస్తుంది. కొడుకు ఆటోరిక్షా నడుపుకుని సంపాదిస్తున్నాడు. వాడి పెళ్లాం మనింట్లో పాచిపని చేస్తుంది. ఏదో చిన్న కొంప చూసుకుని వాళ్లు బయటకి పోవచ్చుగా!" అంది మా ఆవిడ.

ఈ ఇరవైయేళ్లలోనూ చుట్టుపక్కలంతా ఇళ్లు వచ్చేశాయి. ఇంకిప్పుడు వాళ్ల అవసరం, సాయం కోసం మా కాంపోండ్‌లోనే ఉండక్కర్లేదంటుంది.

"వాళ్ల కీ షెడ్ చాలకపోతే వాళ్లే బయట చూసుకుంటారు. మనం ఎందుకూ పంపించెయ్యడం! పైగా రెండేళ్లక్రితం మన ఇల్లు రిపేరు చేయించినప్పుడు వాళ్ల ఇల్లుకూడా శుభ్రం చేయించి ఉండటానికి వీలుగా చేయించేం. పైగా రాత్రిళ్లు వాళ్లల్లో ఇద్దరో, ముగ్గురో వీధి వరండాలో పడుకుని మనకి సాయంగా ఉంటారు, పిలుస్తే పలుకుతారు!" అన్నాను.

"సాయం కాదు, భయం. అదుగో అదుగో అలా చూడండి, ఆ వీరయ్య కూతురు లక్ష్మికి గోపీ మతాబాలందిస్తున్నాడు. వాడు మన కళ్లుకప్పి బియ్యం, పంచదార, పప్పులు, స్టీలు గిన్నెలూ లాంటివి వాళ్లకి నిత్యం అందిస్తూనే ఉన్నాడు!" అంది.

"అయితే గోపీని బయటికి పంపించేస్తాను!" అన్నాను.

మా ఆవిడకి వాడన్నివిధాలా ఇంట్లో సాయం చేస్తూ ఉంటాడు, అంచేత గోపీని పంపించేస్తానంటే ఒప్పుకోదు.

"వాణ్ణి బయటికి పంపడమెందుకండీ! వాళ్లను పంపెయ్యండి"

"వాళ్లిన్నాళ్లూ మనల్ని నమ్ముకునున్నారు. ఇప్పుడెక్కడికి పోతారు!"

"అయినా, మనంమాత్రం ఇక్కడ శాశ్వతమా! ఈ మారుమూల కొంపలో ఎన్నాళ్లుంటాం. ఇప్పుడిది అమ్మిపారేస్తే ఏడెనిమిది లక్షలొస్తుంది. ఆ డబ్బు బేంక్‌లో పడేస్తే, ఉన్న ఫిక్సడ్ డిపాజిట్లతోబాటు దీనిమీదా వడ్డీ వొస్తుంది. పైగా మీకు పెన్షనొస్తుంది. హాయిగా మధ్యమధ్య తీర్థయాత్రలు చేసుకుంటూ, మన పిల్లల దగ్గిరుంటూ నిశ్చింతగా కాలక్షేపం చెయొచ్చు" అంది.

"అని మనపిల్లలు సలహా ఇచ్చేరా?" అని అడిగాను.

అంతే అయి ఉంటుంది. ఇన్నాళ్లూ దర్జాగా, స్వతంత్రంగా బ్రతికినవాణ్ణి. పైగా వీళ్లందరూ నన్నాశ్రయించుకునున్న నా శ్రేయోభిలాషులు, నా బలగం. వీళ్లనొక్కనాటికి విడిచిపెట్టను. వెళ్లి పిల్లల దగ్గిరెన్నాళ్లుంటాం! ఇంక నాకీ తీర్థయాత్రల్లోనూ, పూజల్లోనూ నమ్మకం లేదు. సర్వత్రా ఉన్న భగవంతుడు మనిషి మంచితనానికి సంతుష్టి చెందుతాడుకానీ, స్తోత్రం చేస్తూ విగ్రహాల్ని ఆరాధించడం వల్ల పొంగిపోయి అనుగ్రహిస్తాడనుకోడం భగవంతుణ్ణి కించపరచడమే అవుతుంది. మా ఆవిడ ప్రతి శనివారం దేవుడికి ఇంట్లో ఓ కొబ్బరికాయ కొడుతుంది. దాన్ని దేవుడు తినెయ్యడని దానికి తెలుసు. అంచేత ప్రతి శనివారం మా ఇంట్లో విధిగా కొబ్బరికాయతో చేసిన వంటకం ఉంటుంది. ప్రతి పండగకీ విధిగా ఇంట్లో పిండివంటలతో భోజనం, కొత్త బట్టలు. దేవుడికి మాత్రం మంగళహారతే! తరతరాలుగా వస్తున్న ఆచారం. మా ఆవిడతో వాదించి ప్రయోజనం లేదని నాకు తెలుసు. లేనివాడికింత సాయం చెయ్యడానికి మించిన ఆధ్యాత్మిక సాధనలో నాకు నమ్మకం లేదు.

"వాళ్లు సలహా ఇస్తే వినకూడదా?" అంది మా ఆవిడ.

దానితో ఎక్కువ వాదించను. దానికసలే హై బ్లడ్‌ప్రెషర్. పైగా మందులు సరిగ్గా మింగదు.

"విన్నానుగా! ఆలోచిస్తాను."

"ఇంకా ఎన్నాళ్లాలోచిస్తారండీ! కాస్త పిల్లల మాట తలకెక్కించుకోండి. మొన్న మీకు హార్టెటాకొచ్చిందంటే ఎంత కంగారుపడ్డారు! మనం బొంబాయిలో ఉంటే వాళ్లకి తెలుసున్న హాస్పిటల్సున్నాయి, డాక్టర్లున్నారు...."

"ఇంక నువ్వు అదే పాటపాడ్డం మొదలెడితే నీక్కూడా హార్టెటాకొస్తుంది!" అని నేను అంటూండగా టెలిఫోన్ రింగయింది.

"నా మొహాన్నంతే రాసుందేమోలెండి!" అంటూ టెలిఫోన్ దగ్గిరకెళ్లింది.

టెలిఫోన్ రిసీవర్ అందుకుని, "హలో!" అనడమేమిటి, కెవ్వుమని–"నాన్నా, రఘూ, నువ్వా! ఎలాగున్నావురా! థేంక్యూ.. బాగానే ఉన్నారు. బైపాస్ ఇప్పట్లో అక్కర్లేదన్నారు. ఆఁ.. వాళ్లందరూ ఇక్కడే ఉన్నారు. ముందు నాన్నగారితో మాట్లాడు!" అంటూ రిసీవర్ నాకిచ్చి పట్టరాని ఆనందంతో కిందకెళ్లింది, వాళ్లకందరికీ చెప్పడానికి.

రఘు లాసేంజిలెస్‌నుంచే మాట్లాడాడు. రెండు మూడు నెలలయింది ఫోన్ చేసి. దీపావళి శుభాకాంక్షలు చెప్పి, నా ఆరోగ్యంగురించి అడిగి, తర్వాత గోపీ యోగక్షేమాలు, వీరయ్య కుటుంబం, రామానందం మాస్టారు కుటుంబంగురించి అడిగాడు. ఇంతలో మా వాళ్లందరూ బిలబిలమంటూ వచ్చి గలగలా మాట్లాడుతున్నారు.

అంతకి కిందటి దీపావళిముందు ఇలాగే ఫోన్ చేసి అయిదువేల డాలర్లకు డ్రాఫ్టు పంపాడు. అందులో రెండువేల డాలర్లు గోపీకి ఇమ్మన్నాడు. మా పిల్లలుండగానే డ్రాఫ్టు వచ్చింది. వెంటనే ఆ డ్రాఫ్ట్ మార్చి పిల్లలిద్దరికీ ఇవ్వమని నిర్బంధించింది మా ఆవిడ. అలాగే చేశాను. జరిగిందంతా శివరావుకి చెప్పి నాపేర ఉన్న ఫిక్సెడ్ డిపాజిట్స్‌లోంచి ఓ లక్షరూపాయలు గోపీ అకౌంట్‌లో వేశాను. శివరావుకొడుకు రవిద్వారా జరిగిదంతా తెలిసుంటుంది. ఈసారి వాడు డబ్బేమీ పంపుతున్నట్లు చెప్పలేదు. నేనూ సంతోషించేను.

"నువ్వు డబ్బు పంపడమేమిట్రా! నేనే నీకు పంపే స్థితిలో ఉన్నాను. నీక్కావల్సింది రవినడిగి తీసుకో. నేనిక్కడ శివరావుకిచ్చేస్తాను!" అన్నాను నిరుడు ఫోన్లో.

"నువ్వెంతో నాకోసం ఖర్చు చేశావు. నాకోసం ఎంతో మీరందరూ బెంగెట్టుకు ఉన్నారు. నేనే అవన్నీ మరిచిపోయి, నా బలహీనతకు లొంగి నా దారిన నేను ఇల్లు విడిచిపెట్టి పారిపోయేను. ఇంకా నువ్వు డబ్బు పంపడమేమిటి, నాన్నా! నాకిక్కడ డబ్బు కేవిధమైన లోటూ లేదు. నువ్వు నా తప్పులన్నీ మన్నించి, సహించి ఇంకా ప్రేమిస్తున్నావు. 'టు గెట్ అండ్ ఫర్‌గెట్ ఈజ్ హ్యూమన్, టు గివ్ అంట్ ఫర్‌గివ్ ఈజ్ డివైన్' అన్నాడో మహాపురుషుడు!" అన్నాడు రఘు.

వాడు అమెరికన్ లేడీతో అక్రమ సంబంధం పెంచుకుని, అమెరికా వెళ్లేక పెళ్లి చేసుకున్నాడుట. శివరావు చెప్పాడు. నేనూ ఆ విషయం రహస్యంగా ఉంచాను. వాడికి అందుబాటులో ఉన్న విధానంలో వాడు జీవిస్తూ సుఖదుఃఖాలు అనుభవిస్తున్నాడు. వాణ్ణి తప్పుపట్టే అధికారం ఎవరికీ లేదు.

మొత్తమీద నిరుడు దీపావళి దివ్యంగా గడిచిపోయింది. ఆనందమో, ఆలోచనలో రఘూ గురించి ఆందోళనో తెలియదు, మర్నాడు సాయత్రం హఠాత్తుగా గుండెపోటొచ్చి హాస్పటల్‌కి తరలించేలోపే మా ఆవిడ కన్నుమూసింది. నాకు అంత్యక్రియలు జరపవల్సొస్తుందేమోనన్న భయంతో వచ్చిన పిల్లలు చివరికి మా ఆవిడ అంత్యక్రియల కొచ్చినట్లయింది. వాళ్లు దీపావళి వెళ్లేవరకూ ఆగడం వాళ్లకీ, నాకూకూడా కొంతలోకొంత

దుఃఖోపశమనం కలిగించింది. జాతస్య మరణం ధృవం. కిందటి జన్మలో ఏం పుణ్యం చేసుకుందో అనాయాసంగా నిష్క్రమించింది.

అంత్యక్రియలై మా పిల్లలిద్దరూ ప్రయాణాలయ్యేముందు వాళ్ల అమ్మ జ్ఞాపకార్థం ఆమె నగలు, వెండి సామన్లు, పట్టుచీరలు, స్టీలు సామాన్లు పంచుకున్నారు. ఈ ఇల్లుకూడా అమ్మేసి, ఈ ఒంటరిజీవితానికి స్వస్తి చెప్పి బొంబాయొచ్చెయ్యమని మరోసారి కోరస్‌లో సలహా ఇచ్చారు.

★ ★ ★

అంతవరకూ యాంత్రికంగా దీపావళి సంరంభం చూస్తున్న నేను, వీరయ్యొచ్చి నా కూర్చీ పక్కన కింద కూర్చోగానే ఈ లోకంలో కొచ్చాను. లక్ష్మిచేత చిచ్చుబుడ్లు, సీమటపాకాయ గుత్తులు గోపీ దగ్గిరుండి కాల్పించడం గమనిస్తున్నాను. లోగడ వాళ్లనిగురించి మా ఆవిడ నా చెవిలో గుసగుసలాడడం జ్ఞాపకమొచ్చింది. సాయంత్రం కాస్సేపు నా కాళ్లు పట్టడం వీరయ్య కలవాటు. వద్దన్నా వినడు. మానేస్తే వాడి చేతులు నెప్పులెడతాయేమో! ఆ పనే ఉపక్రమించాడు.

"బాబుగారూ! తమతో ఓ మాట సెప్పాల్నుందండి. కానీ భయంగా ఉంది" అన్నాడు వీరయ్య కాస్సేపున్నాక.

"నీ భయం నాకు తెలుసు. ముందు నీ అభిప్రాయం చెప్పు. గోపీకి నీ కూతురు లక్ష్మినిచ్చి పెళ్లి చేయడం నీకిష్టమేనా?" అడిగాను.

"బాబూ! నా ఇష్టమేంటండి! తవఁరు పెద్దలు. తవఁరి మాట కెదురులేదు. కాని, ఎటొచ్చీ తమ కుటుంబంలో బాబు మా కులంలో పిల్లని...."

"ఒరేయి! కులం ఎవరూ కోరుకోలేదు, ఎన్నుకోలేదు, కొనుక్కోలేదు. ఇది అమ్మాబాబూ వల్ల సంక్రమించిన ముద్ర. ఎవరూ తమ కులానికి బాధ్యులు కారు. ఎవరూ తమ కులం గొప్పదని గర్వపడటం కాని, అల్పమైనదని చిన్నబుచ్చుకోవడంకాని - రెండూ తప్పే. గోపీ, లక్ష్మీ పదేళ్లనుంచీ ఒకళ్లనొకళ్లు ఎరుగుదురు. ఇష్టపడ్డారు. ఇంక లక్ష్మి బియ్యే పాసైంది. ఉద్యోగం చేసుకుంటోంది, గోపీ మెట్రిక్ పేసయ్యేడు. వీడి సంపాదనెలాగుంటుందోనన్న భయం నీ కక్కర్లేదు. గోపీ నాకు నాలుగో కొడుకు. వాడికి ఆస్తిపాస్తులకు లోటు రానివ్వను. వాడికేదో దారి చూస్తాను. వాళ్లు సుఖపడతారనీ నా నమ్మకం!" అన్నాను.

వీరయ్య నోటమాట రాలేదు. తలవంచి ఆనందభాష్పాలతో నా పాదాలు తడుపుతుండగా కిందనుంచి జోరుగా పైకెగుస్తున్న పువ్వుల కేసి చూస్తున్నాను.

ఇంతలో ఫోన్ రింగయింది. వీరయ్య రిసీవర్ అందించాడు. నేను ఎదురు చూస్తున్నట్టే అమెరికా నుంచి రఘు.

"హేపీ దీవాళీ, నాన్నా! తమ్ముడూ, చెల్లాయి ఈసారి రాలేదుట కదా! ఏవో ఇబ్బందులుంటాయి. నేను రాగలుగుతున్నానా! అయినా ఎందుకు నీ కీ మమకారం! ఆల్ రిలెషన్‌షిప్స్ పెరిష్ విత్ ఫ్లెష్... నీకు తెలియంది కాదు. నీ మానసిక సన్యాసం, గుండె ధైర్యం, ఔదార్యం మా అందరికీ తెలుసు. రామానందం మేస్టారుండటానికి కిందభాగం ఇస్తున్నట్టూ, నీ తదనంతరం ఆ ఇల్లు ఆయనకే చెందేటట్లు, ఇంటికి కారు షెడ్లవైపు మూడువందల గజాల స్థలం వీరయ్య కుటుంబానికీ, అవతలవైపు నాలుగు వందల గజాల ఖాళీస్థలం గోపీకి చెందేటట్టు విల్లు రాయమన్నావుటకదా.... దట్ ఈజ్ గ్రేట్! వాళ్లు నీ ఆదరణకి పాత్రులు, నిన్ను కనిపెట్టుకున్న ఆత్మబంధువులు. నీకు పదిరోజుల క్రితం పదివేల డాలర్ల డ్రాఫ్ట్ పంపేను. నువ్విచ్చేది నువ్వెలాగూ ఇస్తావు. నేను పంపిందాంట్లో సగం గోపీకి, మిగిలిన సగం మేస్టారుకీ, వీరయ్యకీ చెరిసగం ఇయ్యి. తముడికీ-చెల్లాయికీ ఉన్నదీ, ఇచ్చినదీ చాలు, ఇంకా ఇస్తే మహా పాపం అన్నావుట! అది ఫోన్లో చెప్పి, శివరావుగారు ఒకటే నవ్వు. నీ తదనంతరం నీ పేర మిగిలినడబ్బు శివరావుగారు కమిటీ మెంబర్‌గా ఉన్న అనాథశరణాలయానికి రాసెయ్యమన్నావుట. ఆయన ఎంతో సంతోషించేడు. అమ్మ తన సహజమైన మమకారంతో చెయ్యగలిగినంత దానధర్మాలు చెయ్యలేకపోయింది. ఆవిడనీ సహధర్మచారిణి. నీ పుణ్యఫలంలో ఆవిడకీ సగభాగం ఉంటుం...." అంటూ చెప్పుకుపోతున్నాడు రఘు.

"ఒరేయి నీ దండకం ఆపు. నువ్వెలా ఉన్నావు. శివరావు ద్వారా నేను విన్నది నిజమేనా?" అని అడిగాను.

"నాన్నా! లైఫ్ ఈజ్ ఫర్ లివింగ్! 'న పుణ్యం, న పాపం, న సౌఖ్యం, న దుఃఖం.. చిదానంద రూపం శివోహం శివోహం' అన్న శ్లోకం గుర్తుందా! నా భార్య నాకంటే వయస్సులో పదేళ్లు పెద్దది. నేనామెకు నాలుగో భర్తని. నాకామె ఎన్నోవిధాల సహాయం చేసింది. మనిషన్నాక ఏవో లోపాలుంటాయి. ఈ మధ్యనే 'నేను మరో స్నేహితుణ్ణి ప్రేమించేను. అతన్ని పెళ్లి చేసుకుంటాను. మనం విడాకులు తీసుకుందాం.

నువ్వనుమతిస్తావా?' అని అడిగింది. ఎటువంటి వాదోపవాదాలు, షరతులు లేకుండా అంగీకారపత్రంమీద సంతకం పెట్టేను. ఆమె చాలా ధనవంతురాలు. నేనేమీ అల్లరి పెట్టనందుకు సంతోషంగా, నేనొద్దన్నా నా బేంక్ అకౌంట్‌లో లక్ష డాలర్లు వేసింది. ఇక్కడ జీవితాని కలవాటుపడ్డాను. మార్గం ఎలాంటదైనా నేను దుర్మార్గుణ్ణి కాను. నేను ఒంటరిగా ఉన్నానుకోకు. నాలోనూ, నాకూడాను భగవంతుడు ఉండి నన్ను నడిపిస్తున్నాడు. జన్మనిచ్చిన నీకే కాదు, ఈ సమాజానికీ కృతజ్ఞుణ్ణే. ఉంటాను!" అని ఫోన్ పెట్టేశాడు.

"రఘుబాబుగారి దగ్గిర్నుంచా బాబూ, ఆ ఫోను? ఎలా ఉన్నారు?" అనీ వీరయ్య అడిగాడు.

"వాడికేం లోటు లేదు. హాయిగా ఉన్నాడు. వాడసలైన కర్మయోగి!" అన్నాను ఆనందంగా, గర్వంగా...

** ఆంధ్రప్రభ, అక్టోబరు 1998*